సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



రేషన్ బియ్యం స్వాధీనం

ఉమ్మడి జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

10లో ▸



జోరుగా 'ఉపాధి' పనులు

పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువు తవ్వకం, పూడికతీత పనులు చేస్తున్నారు.

10లో ▸

చేపకు గడ్డుకాలం

అధిక ఉష్ణోగ్రతలతో ఆక్వా సాగు సతమతమవుతోంది. చేపలపై ఒత్తిడి పెరిగి వ్యాధి నిరోధక శక్తి కోల్పోతున్నాయి. చెరువుల్లో చేపలకు వ్యాధులు ప్రబలుతున్నాయి.



10లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సహరి (ఆదివారం వేకువజాము)
భీమవరం	6.25	4.32
తాడేపల్లిగూడెం	6.27	4.40
నరసాపురం	6.24	4.31



తాడేపల్లిగూడెంలో జగనన్నే మా భవిష్యత్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకులో ఇంటికి వెళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



నరసాపురంలో వార్డుల్లో పర్యటిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



పెనుమంత్ర మండలం పాలమూరులో వృద్ధురాలికి బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజలతో మరింత మమేకం

జగనన్నే మా భవిష్యత్తు

- జిల్లావ్యాప్తంగా కార్యక్రమం ప్రారంభం
- లబ్ధిదారుల నోట అభివృద్ధి ఆనవాళ్లు
- పథకాలు వివరిస్తున్న ప్రజాప్రతినిధులు



భీమవరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్



పాలకొల్లులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



కాళ్ల మండలం పెదఅమిరంలో స్టిక్కర్ అతికిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

సాక్షి, భీమవరం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు ప్రజలతో మరింత మమేకం కానున్నారు. ఇప్పటికే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తుండగా.. ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ వార్డు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజల వద్దకు వెళ్లే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ప్రభుత్వ చీఫ్‌విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతో పాటు సంక్షేమం, అభివృద్ధిపై ఆరా తీశారు. జగనన్నే మా భవిష్యత్ పోస్టర్లను అతికించారు.

సంక్షేమ ఫలాలను..

రాష్ట్రంలో సంక్షేమ ఫలాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురంలోని 6వ వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి వినతులు, సలహాలు స్వీకరించారు. అబద్ధపు హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కుట్రపన్నుతున్నాడని విమర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

అర్హుడైన ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఎన్నడూ లేనివిధంగా ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలకు ఆర్థిక సాయం, రుణాలు మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంత్ర మండలం నాగళ్లదిబ్బలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఆయన వెంట రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోసం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి క్షణం ప్రజల శ్రేయస్సు కోసం ఆలోచిస్తున్నారని, ఎన్నడూ లేనివిధంగా నవరత్నాల పేరుతో పథకాలు అమలు చేస్తున్నారని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని 2వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలను వివరించారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు పాల్గొన్నారు.

తేడా గమనించండి

సంక్షేమ పథకాలు పొందిన ప్రతిఒక్కరూ గత ప్రభుత్వానికి ప్రస్తుతం సీఎం జగన్ పాలనకు తేడా గమనించాలని జెడ్పీ చైర్మన్, పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు 30వ వార్డు మావుళ్లమ్మపేట, యలమంచిలి మండలం కలగంపూడి, ఏనుగువానిలంక, మేడపాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. యడ్ల తాతాజీ, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ పాల్గొన్నారు.

పారదర్శక పాలన

సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందడం సీఎం జగన్ పారదర్శక పాలనకు నిదర్శనమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు, ఆకివీడు మండలం సిద్దాపురం, కాళ్ల మండలం పెదఅమిరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంపీపీలు ఇందుకూరి శ్రీహరిరాజు, భూపతిరాజు చంటిరాజు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మన భవిష్యత్తు.. నమ్మకం జగనన్న

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజల భవిష్యత్తు, నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ వరకూ నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేయాలని వార్డు ఇన్‌చార్జిలు, కన్వీనర్లకు పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పాలన రాష్ట్రంలో అందిస్తున్నారన్నారు. ప్రతి గడపకూ వెళ్లి పథకాలు అందాయా లేదా అన్నది తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పాలనను వివరించాలన్నారు.

ప్రతిపక్షాల్లో అయోమయం : వచ్చే ఎన్నికల్లో టీడీపీ సీఎం అభ్యర్థి చంద్రబాబా, లోకేషా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, జనసేన, టీడీపీ కలిసి పోటీచేస్తే సీఎం పదవి పవన్‌కల్యాణ్‌కు ఇస్తారా అని మంత్రి కొట్టు ప్రశ్నించారు. పోటీ చేయడానికి అభ్యర్థులు ముందుకు రాకపోవడంతో ఎవరిని నిలపాలో తెలియక ఆ రెండు పార్టీలు అయోమయంలో ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ గృహసారథులు, కన్వీనర్లపై ఉందన్నారు. జెడ్పీటీసీ ముత్యాల అంజనేయులు, ఎంపీపీ దాసరి హైమావతి, బోణం విజయనిర్మల, గుండుమోగుల సాంబయ్య, ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, కైకాల శ్రీనివాస్, వెలిశెట్టి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

పేదలకు బంగారు బాట

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల భవిష్యత్‌కు బంగారుబాట వేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఉండ్రాజవరం రోడ్డు చాకలిచెర్వు ప్రాంతంలోని సచివాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20వ తేదీ వరకూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో గృహసారథులు కీలక పాత్ర పోషించనున్నారన్నారు. సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సీఎం జగన్ పాలనపై ప్రజలు సంతృప్తి చెందుతున్నారా అనే విషయాన్ని నేరుగా తెలుసుకుంటామన్నారు.

ఎల్లోమీడియా దుష్ప్రచారం

చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని ప్రతి కార్యక్రమంపై దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి కారుమూరి విమర్శించారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తూ అబద్ధాలను నిజం చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. అనంతరం ఉండ్రాజవరం రోడ్డులోని ఎస్ఎఫ్ఎస్ స్కూలు ప్రాంతంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేఎస్ఎస్ పట్టణ కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, సుద్దుల పాండు, గుబ్బల సూర్యచంద్రరావు, మారిశెట్టి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

క్రైస్తవ విశ్వాసులు లోకరక్షకుడు ఏసు త్యాగాలను స్మరిస్తూ.. సహనం, శాంతికి ప్రతీకగా గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ట్రినిటీ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసుల దృశ్యమిది. - ఉండి

జాతీయస్థాయి నాటిక పోటీలు ప్రారంభం



నాటిక పోటీల ప్రారంభ దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: సమాజాభివృద్ధికి మంచి సందేశాన్ని ఇచ్చేది నాటక రంగమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. శుక్రవారం పాలకొల్లులో పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ అధ్యక్షతన అద్దేపల్లి వారి సత్రం ప్రాంగణంలో విన్నకోట వెంకటేశ్వరరావు కళావేదికపై 14వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటికలు అంతరించిపోకుండా కళాకారులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు మాట్లాడుతూ భీమవరం, వీరవాసరం, తోలేరు వంటి ప్రాంతాల్లో కళాపరిషత్‌లు క్రమం తప్పకుండా నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఇంటికో కళాకారుడు, వీధికో కళాపరిషత్ ఉన్న పాలకొల్లుకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి జ్యోతి ప్రజ్వలనం చేశారు. సంచారజాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, చిట్టూరి ఏడుకొండలు, ఆకుమర్తి బాబూరావు,సీహెచ్ సత్యనారాయణ మూర్తి, సారిక రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు కొత్త పరిమళం, కెరటాలు నాటికలను ప్రదర్శించారు.

సందేశాత్మకంగా..

ద్వేషం మనిషికైనా, దేశానికైనా ప్రమాదమే అనే సారాంశంతో శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం, బోరివంక, శ్రీకాకుళం జిల్లా వారి ఆధ్వర్యంలో కొత్త పరిమళం నాటికను ప్రదర్శించారు. మూలకథ కాండ్రేగుల శ్రీనివాసరావు, నాటకీకరణ కేకేఎల్ స్వామి, దర్శకత్వం బీఎంఎస్ పట్నాయక్ వహించారు. అలాగే యువతరం ఆత్మాభిమానం పేరుతో భేషజాలకు పోయి జీవితాల్ని నరకప్రాయం చేసుకుంటున్నాయని ఇతివృత్తంతో కెరటాలు నాటిక ప్రదర్శించారు. మూలకథ భాగవతుల రమాదేవి, నాటకీకరణ, దర్శకత్వం మునిపల్లె విద్యాధర్ వహించారు.

గల్ఫ్‌లో ఉపాధి అవకాశాలపై శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ శిక్షణతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని, 18 నుంచి 45 ఏళ్ల లోపు మహిళా అభ్యర్థుల నుంచి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీ రావు ఓ ప్రకటనలో తెలిపారు. నకిలీ ఏజెంట్ల మోసాలను అరికట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో (తూర్పు, పశ్చిమ గోదావరి, కడప జిల్లాలు) శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. ఆయా దేశాల్లో పద్ధతులు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు, చట్టాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకుని ఉపాధి పొందిన మహిళలకు గల్ఫ్ దేశాల్లో జీతభత్యాలు సక్రమంగా అందుతున్నాయా తెలుసుకోవడంతో పాటు ఇబ్బందులు తలెత్తితే భారత రాయబార కార్యాలయం బాధ్యత తీసుకుని సాయం అందిస్తుందని తెలిపారు. 5వ తరగతి చదివి, చదవడం, రాయడం తెలిసిన మహిళలు శిక్షణకు అర్హులని, వివరాలకు సెల్ 965250 3799లో సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

శ్రీనివాసుని కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు



కల్యాణ మండపాన్ని ముస్తాబు చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్ర ఉపాలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఈనెల 12 నుంచి 18 వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయం ఎదుట చలువ పందిరిని నిర్మించారు. ఆలయ ద్వారాలకు, గోడలకు, కల్యాణ మండపానికి రంగులు వేస్తున్నారు. యాగశాలను ముస్తాబు చేశారు. మరో నాలుగు రోజుల్లో విద్యుద్దీప అలంకారణ పనులు పూర్తిచేస్తామని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 12న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 13న ధ్వజారోహణ, 14న ఎదుర్కోలు ఉత్సవం, 15న రాత్రి స్వామివారి తిరుకల్యాణం, 16న గరుడోత్సవం, 17న శ్రీ చక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ, 18న రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు.

భగవద్గీత శ్లోక పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాస్థాయిలో ఈనెల 9,10 తేదీల్లో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటల నుంచి భగవద్గీత శ్లోక పఠన నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ్ రాజు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. పోటీల్లో 500 మందికి పైగా పాల్గొంటారన్నారు. విజేతలకు 13న ఆనందరాజు వర్ధంతి సభలో బహుమతులు అందిస్తామన్నారు. ఉద్దరాజు జోగి రాజు, దాయన చంద్రజీ, కంతేటి వెంకటరాజు, సి.హెచ్. రంగసాయి, దండు సాయిరాజు, రాంబాబు పాల్గొన్నారు.

108లో ప్రసవం



108లో జన్మించిన శిశువు

కాళ్ల: 108లో సురక్షిత ప్రసవం జరగడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. భీమవరం మండలం ఎల్‌వీఎన్ పురం పరిధిలోని పల్లిపాలెం గ్రామానికి చెందిన జి.ప్రియను ప్రసవం నిమిత్తం భీమవరం తీసుకువెళ్లారు. శుక్రవారం అక్కడి వైద్యులు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేయగా 108లో బయలుదేరారు. మార్గమధ్యంలో శ్రీపర్రు వద్ద ఆమెకు నొప్పులు రావడంతో 108 సిబ్బంది సురక్షిత ప్రసవం చేశారు. దీనిపై గర్భిణి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈఎంటీ బాలకృష్ణ, డ్రైవర్ ఆర్‌పీ రాజు, ఆశ వర్కర్లు ఉన్నారు.

బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

రాజానగరం (తూర్పుగోదావరి): ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో ఈనెల 10న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాల వ్యవధితో కూడిన ఈ కోర్సులో ప్రవేశాలు ఏపీ ఎడ్‌సెట్–2022 నియమావళిని అనుసరించి ఉంటాయని పేర్కొన్నారు. అర్హత ఉన్నవారు ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల మధ్య రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, సాయంత్రం 5 గంటల్లోగా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

తణుకులో పెట్రోలు కల్తీ



నీళ్లు కలిసిన పెట్రోలు చూపిస్తున్న వినియోగదారుడు రాంబాబు

తణుకు: తణుకు పెట్రోలు బంకులో కల్తీ జరిగింది. నీళ్లు కలిసిన పెట్రోలు పోయడంతో వినియోగదారుడు ఆందోళనకు దిగాడు. తణుకు పట్టణంలోని స్థానిక కేశవస్వామి దేవాలయం సమీపంలోని హెచ్‌పీసీఎల్ సంస్థకు చెందిన ఎల్ఎస్ఎం ఫిల్లింగ్ స్టేషన్‌లో కొట్టించిన పెట్రోలులో నీళ్లు కలిశాయి. తణుకు మండలం కొమరవరం గ్రామానికి చెందిన రాంబాబు మంగళవారం తన మోటారు సైకిల్‌లో ఫుల్ ట్యాంకు పెట్రోలు కొట్టించారు. అప్పటి నుంచి మోటారు సైకిల్ ఆగిపోతుండటంతో మెకానిక్‌కు చూపించారు. పరిశీలించిన మెకానిక్ మోటారు సైకిల్‌లోని పెట్రోలు బాటిల్‌లో పట్టించారు. పెట్రోలు మురికి పట్టి నీళ్లు కలిసినట్లు గుర్తించారు. దీంతో వాహనదారుడు పెట్రోలు బంకు ఎదుట ఆందోళన చేపట్టారు. ఇదే తరహాలో ఇటీవల పట్టణంలోని అదే సంస్థకు చెందిన పాపారావు పెట్రోలు బంకులో సైతం పెట్రోలులో నీళ్లు కలిసిన ఘటనకు సంబంధించి సంస్థ అధికారులు విచారణ నిర్వహించారు.

గంజాయి స్వాధీనం

పెనుగొండ: పెనుగొండ సిద్ధాంతం రోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఇద్దరి నుంచి రూ.20 వేలు విలువైన 5.155 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, వారిని అదుపులోకి తీసుకొన్నట్లు పెనుగొండ ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ గురువారం సమాచారం రావడంతో తహసీల్దారు ఎస్.గురుమూర్తి, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. పాడేరుకు చెందిన లకే మణికంఠ, పెనుగొండ యర్రా నారాయణ స్వామి కాలనీకి చెందిన కొండేటి ఈశ్వర బాబులు బ్యాగుల్లో వీటిని ఉంచుకొని పారిపోతుండగా పట్టుకొన్నట్లు వివరించారు. ఇన్‌చార్జి సిఐ, పాలకొల్లు టౌన్ సిఐ డి.రాంబాబు దర్యాప్తు చేసి కేసు నమోదు చేయడంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో సాయపడిన సిబ్బందిని ఆయన అభినందించారు.

చేపకు గడ్డుకాలం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఆక్వాలో చుట్టుముడుతున్న వ్యాధులు



కైకలూరు: అధిక ఉష్ణోగ్రతలతో ఆక్వా సాగు సతమతమవుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాలు చేపల చెరువులు, 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయి. చేపల సాగులో నీటి ఉష్ణోగ్రత ముఖ్యం. 30 సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉంటే చేపలపై ఒత్తిడి పెరిగి వ్యాధి నిరోధకశక్తి కోల్పోతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో శంకుపూత, పొట్ట ఉబ్బు వ్యాధి, తాటాకు తెగులు, ఆక్సిజన్ లేమి సమస్య, ఎర్ర మచ్చల వ్యాధి రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వీటి లక్షణాలు, నివారణను కైకలూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.భవిత వివరించారు.

శంకుపూత..



ఇది చేపల శ్వాస క్రియను దెబ్బతీసే భయంకర వ్యాధి. మిక్సోబోలాన్ అనే పరాన్నజీవి వల్ల ఇది వ్యాపిస్తుంది. ఈ పరాన్నజీవులు చేప ఆహారనాళం, రక్తనాళం, శంకుల్లో సిద్ధ బీజాలుగా ఏర్పడతాయి. ఇవి పెరిగి తెలుపు, పసుపు రంగులో బొడిపెలవలే కనిపిస్తాయి. చేపశంకుల్లో ఎక్కువ సంఖ్యలో అక్రమించి శ్వాస వ్యవస్థను దెబ్బతీసి మృత్యువాత పడేలా చేస్తాయి. ఈ వ్యాధి సోకిన చేపలు నీటిపైకి ముట్టెలు ఎత్తి ఆక్సిజన్ పీల్చుకోడానికి ప్రయత్నిస్తాయి. దీనిని గుర్తించగానే ఎకరం చేపల చెరువులో క్విక్‌లైమ్ 100 నుంచి 150 కేజీల చొప్పున వాడాలి.

తాటాకు తెగులు



వేసవిలో ఎక్కువగా వచ్చే వ్యాధి ఇది. దీనినే కాలుమ్నారిస్ వ్యాధి అంటారు. ఇది ఎక్కువగా చేపతోక భాగం, మొప్పలకు సోకుతుంది. చేప శరీరం, శంకుభాగం తొలిచివేయడం వల్ల చేప శంకులు తాటాకు రంగులోకి మారతాయి. ఈ వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు చేప శరీరంపై పసుపు, బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి. చెరువులో చేపలు భారంగా ఈదుతాయి. ఈ వ్యాధి సోకినప్పుడు ఒక టన్ను చేపలకు డాక్సిసైక్లిన్(2శాతం) రోజుకు 100 గ్రాముల చొప్పున 6 నుంచి 9 రోజులు చెరువు నీటిలో కలపాలి. వెంటనే చెరువు నీటి పరీక్షలు చేయించాలి. తాటాకు తెగులు అని అనుమానం వచ్చిన వెంటనే ల్యాబ్‌లో పరీక్షలు చేయించడం ఉత్తమం.

రెడ్ డిసీజ్ వ్యాధి



వేసవిలో ఎక్కువగా వచ్చే బాక్టీరియా వ్యాధి చేప ఎర్రగా మారే వ్యాధి(రెడ్ డీసీజ్). ఈ వ్యాధి లక్షణాలతో శరీరం ఎర్రబారుతోంది. కళ్ళలో రక్తపు చమరింపు కనిపిస్తుంది. మొప్పల అడుగున ద్రవం చేరుతుంది. ప్రేగులు ఖాళీగా ఉండి, పైన కొవ్వు కూడా ఎర్రబడుతుంది. చేప చనిపోయే ముందు నీటి ఉపరితలం దగ్గర గుండ్రంగా లేక క్రమ రహితంగా ఈదుతుంది. ఈ వ్యాధిని గమనించిన వెంటనే నిపుణల సలహాతో ఎంపిక చేసిన యాంటీ బయాటిక్స్ 8-10 గ్రాములు 100 కేజీల చేపలకు మేతలో కలిపి 7 నుంచి 10 రోజులు వాడాలి. నీటిలో బ్యాక్టీరియా సాంద్రత తగ్గించడానికి అయోడిన్, టీకేసీ, బ్రోమిన్ వంటివి 500 మిల్లీగ్రాముల నుంచి 1 లీటరు ఎకరాకు వాడాలి.

పొట్ట ఉబ్బు వ్యాధి



ఈ వ్యాధిని హెమోరేజిక్ సెప్టిసీమియా అని పిలుస్తారు. ఎయిరో మోనాస్, సూడోమోనాస్ జాతుల బ్యాక్టీరియా కారణంగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన చేప ఉదర కుహరం, పేగులు పసుపు, ఎరుపు రంగులో ఉంటాయి. చెడు ద్రవంతో నిండి పొట్ట ఉబ్బినట్లు కనిపిస్తుంది. చేపను గట్టిగా నొక్కితే పాయువు నుంచి ద్రవం కారుతుంది. ఈ వ్యాధి సోకిన చెరువులో 2 నుంచి 5 శాతం బ్రోమిన్‌ను ఎకరానికి లీటరు చొప్పున చల్లాలి. నిపుణుల సలహాతో ఇతర వాటర్ శానిటైజర్స్ కూడా వాడొచ్చు. పొట్ట ఉబ్బు వ్యాధి సోకిన చేపల శరీరం, మూతి వద్ద ఎరుపు మచ్చలు కనిపిస్తాయి. ఇటీవల కాలంలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది.



ఎం.భవిత, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి, కైకలూరు

ఆక్సిజన్ లేమి సమస్య

ప్రస్తుతం ఆక్వారంగాన్ని కుదిపేస్తున్న సమస్య ఆక్సిజన్ లేమి. అప్పటివరకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడితే చెరువు నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. దీంతో ఒక్కసారిగా వేల చేపలు మృత్యువాతపడతాయి. ఏటా ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉత్పన్నం అవుతోంది. ఈ వ్యాధి సోకితే 100 మిల్లీలీటర్ల డెల్టామెత్రిన్‌ను కలిపి చల్లాలి. రోజుకు టన్ను మేతలో 60 నుంచి 80 కేజీల ఉప్పు కలిపి 5 నుంచి 8 రోజులు చల్లాలి. మేతలో ఆల్బెండజల్ వంటి మందులను తగు నిష్పత్తిలో కలిపి 4 నుంచి 5 రోజులు చల్లినా ప్రయోజనం ఉంటుంది.

రైతులు పాటించాల్సి సూచనలు

- నీటి ఉష్ణోగ్రత అనుకూల స్థాయిలో ఉండడానికి నీటి లోతు కనీసం 5 అడుగులు ఉండాలి.
- ఆక్సిజన్ లోటు ఏర్పడుతున్నట్లు గమనిస్తే రాత్రి 12 గంటల నుంచి ఉదయం ఎండ వచ్చే వరకు ఏరియేటర్లు ద్వారా లేదా చెరువులోని నీటిని పుంపు ద్వారా రీసర్కులేషన్ చేయడం ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తిని పెంచవచ్చు.
- నీటి సెలైనిటీని పరీక్షించి 3 పీపీటీ కంటే ఎక్కువ కాకుండా చూడాలి. సెలైనిటీ ఎక్కువైతే మంచి నీటిని చెరువులోకి తోడాలి.
- ల్యాబ్‌లో మేతలు, మట్టి పరీక్షలు చేయించాలి.
- సేంద్రీయ, రసాయన మందుల వాడకం తగ్గించాలి.
- నిషేధిత యాంటీబయాటిక్స్ వాడకూడదు.
- 15 రోజులకు ఒకసారి నీటి పరీక్ష చేయించాలి.

రేషన్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పంగిడిగూడెం శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న డిప్యూటీ తహసీల్దార్(డీటీ) రమేష్, ఎస్సై సాగర్ బాబులు నిఘా పెట్టి బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లా విసన్నపేట నుంచి బియ్యాన్ని కొయ్యలగూడెం తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు డీటీ రమేష్ తెలిపారు. కోళ్ల ఫాంకి ఈ బియ్యం తరలిస్తున్నామని లారీ డ్రైవర్ పడాల రామకృష్ణ చెబుతున్నాడని, ఊట చంద్రకుమార్ ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడని డీటీ రమేష్ తెలిపారు. 192 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని లారీ, బియ్యం కలిపి రూ.10.40 లక్షలు ఉంటుందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం లారీని జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పెనుమంత్ర మండలంలో..

పెనుమంత్ర: పెనుమంత్ర మండలం బ్రాహ్మణ చెర్వు సెంటర్‌లో శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న వ్యాన్‌ని సీజ్ చేసినట్లు ఏలూరు జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి కరణం కుమార్ తెలిపారు. వీరవాసరం నుంచి తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు గ్రామానికి తరలిస్తున్న రూ. 72 వేలు విలువైన 40 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. వీరవాసరం మండలం తోకలపూడి గ్రామానికి చెందిన బియ్యం యజమాని కత్తుల సత్తిబాబు, తూర్పుగోదావరి జిల్లా ఆలమూరుకు చెందిన వ్యాన్ డ్రైవర్ గంగుల వీర గణేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



పెనుమంత్ర మండలం బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో బియ్యం వ్యాన్ పట్టుకున్న అధికారులు

జోరుగా ఉపాధి హామీ పనులు

- ఈ ఏడాది పశ్చిమలో 40 లక్షల పనిదినాలు లక్ష్యం
- చెరువులు, పంట కాలువలు, బోదెల పూడికతీత పనులు

భీమవరం(ప్రకాశం చౌక్) : ఉపాధి హామీ పథకం పనులు పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి. జిల్లాలోని 19 మండలాల్లోని గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. కూలీల వేతనం కూడా రూ 15 పెంచి రూ.272 చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలు పనులు చేయడానికి ముందుకువస్తున్నారు. అమృత సరోవర్ పథకంలో చెరువులు తవ్వకం, కాలువల, పంట బోదెలల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

ఈ ఏడాది లక్ష్యం 40 లక్షల పని దినాలు

2023–24 ఈఏడాది ఉపాధి హామి పథకం పనులకు సంబంధించి 40 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. గత వారం రోజులగా జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు జరుగుతుండగా రోజుకు 16 వేల నుంచి 17 వేల మంది కూలీలు పనులు చేస్తున్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి అదేశాల మేరకు ప్రతి మండలంలో రోజుకు 1200 నుంచి 1500 మంది వరకు కూలీలకు పని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా కూలీల సంఖ్య పెంచుతూ వారికి పని కల్పించడానికి ఉపాధి హామీ పథకం అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించి వారికి ఏడాదిలో 100 రోజుల పని పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. కొలతల ప్రకారం, పని గంటల ప్రకారం పనులు చేయించి కూలీలకు పూర్తి వేతనం అందేలా చూస్తున్నారు. పనులు చేసిన మూడు నుంచి నాలుగు రోజుల్లో కూలీ వేతనం వారికి జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను అదేశించారు. ఉపాధి పనులు ద్వారా పంట కాలువలు, బోదెలను కూలీలు బాగుచేయడంతో రైతులకు మేలు జరుగుతుంది. కాలువలు, బోదెలు పూడికపోయి.. తూడుతో ఉండడంతో సాగు నీటి ప్రవహానికి ఆంటకం కలుగుతుంది. దాంతో చివరి పొలాలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూలీలు కాలువలు, బోదెలను బాగు చేయడం వల్ల సాగునీటికి ఇబ్బందులు లేవు. గతంలో రైతులే కాలువలను, బోదెలను కూలీల్ని పెట్టి బాగుచేయించుకునేవారు. అందుకు వారు సొంత ఖర్చు భరించేవారు. నేడు ఉపాధి కూలీలు ఆ పనులు చేయడం వల్ల రైతులకు ఆర్థిక ప్రయోజం కలుగుతుంది.

గతేడాది రూ.61.37 కోట్ల చెల్లింపు

గతేడాది జిల్లా వ్యాప్తంగా 40 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా 36.50 లక్షల పనిదినాలు పూర్తి చేశారు. అందుకు రూ 61.37 కోట్లు కూలీలకు వేతనాల రూపంలో చెల్లించారు.



ఉండిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



యలమంచిలిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు

జిల్లాలో ఉపాధి జాబ్ కార్డులు	1,78,377
యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులు	1,27,307
కూలీల సంఖ్య	2,96,000
పనికి వస్తున్న వారు	1,99,276

జిల్లా వ్యాప్తంగా పనులు జరుగుతున్నాయి



ఈ ఏడాది ఉపాధి హామీ పనులు 40 లక్షలుగా నిర్దేశించాం. వారం రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. రోజుకు 16 వేల నుంచి 17 వేల మంది పనులు చేస్తున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచుతాం.

ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డ్వామా పీడీ, భీమవరం

ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు నిర్వహణ



నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న వర్క్‌షాపు

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్క్‌షాపుల ద్వారా విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ వర్క్‌షాపులో బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్(బీఐఎం) అనే అంశంపై నిపుణులు పాల్గొని ప్రసంగించారు. దీనిలో ఐఐఎస్‌సీ, దేశపెక్స్ అనే నిర్మాణ కంపెనీలో పరిశోధన ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నవీన్ కుమార్ పాల్గొని బీఐఎం సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం, వ్యాపార వర్గాలు, ప్రజలు వినియోగిస్తారని వివరించారు. బీఐఎం సాఫ్ట్‌వేర్ అనేది విభిన్న మౌలిక సదుపాయాలను ప్లాన్ చేసి, డిజైన్ చేసి, నిర్మించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆచార్య గోపాలరాజు, ఏవో ప్రదీప్‌కుమార్, డీన్ అకడమిక్ లక్ష్మణరావు, హెచ్‌వోడీ బీ.శ్రీనివాసరావు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తోన్న డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్

నూజివీడు: స్థానిక సీసీఎస్ నుంచి గతనెల 30వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో పారిపోయిన దొంగ పఠాన్ సలార్‌ఖాన్‌ను అరెస్టు చేసినట్లు నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు మండలం జంగంగూడెం, చాట్రాయి మండలం కోటపాడు గ్రామాల్లోని ఆలయాల్లోని ఆభరణాలను దొంగిలించిన సంఘటనల్లో సలార్‌ఖాన్ నిందితుడు. అతనిని రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ అరెస్టు చేసి సీసీఎస్‌లో ఉంచగా సిబ్బంది కళ్లు గప్పి హోంగార్డ్‌ను గదిలో ఉంచి బయట గడియపెట్టి పరారయ్యాడు. దీంతో అతని కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలించగా శుక్రవారం టౌన్ ఎస్ఐ–2 గొర్రెల వెంకటేష్ నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లి వద్ద అరెస్టు చేశారు. అతను దొంగిలించిన ఆభరణాలను తునిలో ఉన్న అతని స్నేహితునికి అప్పగించగా వాటిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దొంగ పరారీ ఘటనలో నలుగురిపై వేటు

పట్టణంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) నుంచి గత నెల 30న దొంగ సలార్ ఖాన్ పరారీ కేసులో ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ నలుగురు పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. సీసీఎస్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తోన్న హెడ్‌కానిస్టేబుల్ జే.బాలరమేష్, కానిస్టేబుళ్లు కే.ఆనంద్, వీ.చంటిలను సస్పెండ్ చేయడంతో పాటు హోంగార్డు మాధవరావును విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

మతసామరస్యం చాటిన ముస్లిం సోదరులు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో మత సామరస్యానికి ఉదాహరణగా ముస్లిం సోదరులు గుడ్ ఫ్రై డే రోజు క్రైస్తవ భక్తులకు పండ్ల రసం పంపిణీ చేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మండుటెండలో శిలువ యాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తున్న క్రిస్టియన్ సోదరులకు జామియ మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌డి బాబు, కార్యదర్శి ఎండి జిలాని, జమాతె ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ, ఎస్‌కె ఆజాద్‌బాబు, ముస్లిం యూత్ నేతృత్వంలో రెండు వేల మంది క్రైస్తవ భక్తులకు సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఎస్ఐ డి హరికృష్ణ చేతుల మీదుగా ఫ్రూటీలు అందచేశారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఐక్యతతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆజాద్‌బాబు తెలిపారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం: మండలంలోని దండగర్రలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు: మండలంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలికి సంక్షేమాన్ని వివరిస్తున్న మంత్రి కారుమూరి

తెలంగాణ వెళ్లి పింఛన్ అందజేత



ఖమ్మం ఆస్పత్రిలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందించి, వేలిముద్ర వేయించుకుంటున్న వలంటీర్ నాగ శ్రీనివాస్

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్.జగన్నాథపురానికి చెందిన వలంటీర్ తెలంగాణ రాష్ట్రంలోని, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి శుక్రవారం పింఛన్‌ను అందజేశాడు. వివరాల ప్రకారం.. ఐఎస్.జగన్నాథపురం గ్రామానికి చెందిన నింద్రకొలను సముద్రం అనే వృద్ధురాలు ఖమ్మంలోని ఒక ఆస్పత్రిలో కాలికి శస్త్రచికిత్స చేయించుకుంది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలోనే ఉంది. వలంటీర్ నీలపాల నాగ శ్రీనివాస్ 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖమ్మంకు వెళ్లి పింఛన్‌ను అందించాడు. ఈ సందర్భంగా వలంటీర్‌ను పలువురు అభినందించారు.

రాజమండ్రి వెళ్లి పింఛన్ పంపిణీ



రాజమండ్రి వెళ్లి పెన్షన్ అందచేస్తున్న వలంటీర్ తాడి మహేష్

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం 3వ వార్డుకు చెందిన పడాల రమణ ఆపరేషన్ నిమిత్తం రాజమండ్రిలో ఉంటున్న నేపథ్యంలో వార్డు వలంటీర్ తాడి మహేష్ అక్కడికి వెళ్లి పెన్షన్ అందచేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తుందని లబ్ధిదారురాలు రమణ ఆనందం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

సత్యసాయి సేవా సంస్థ సేవలు ఆదర్శనీయం



వాటర్ బాటిల్స్ అందజేస్తున్న సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పట్టణ సర్కిల్ ఇనస్పెక్టర్ నాగరాజు, ట్రాఫిక్ ఎస్సై సుబ్రహ్మణ్యంలు కొనియాడారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ఎండలలో విధులను నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు, సిబ్బందికి సంస్థ తరుపున శుక్రవారం స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆకుల నవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, జంధ్యాల నాగేశ్వరరావు, తోట తిరుపతి రాయుడు, విజయసాయి, అనిల్‌కుమార్, గ్రంధి సాయి, సతీష్, వంశీ, సూరజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి మహాసభలు జయప్రదం చేయండి



జాతీయ మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న ఇఫ్టూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇఫ్టూ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఇఫ్టూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఇఫ్టూ జాతీయ మహాసభలు తిరుపతిలో ఈ నెల 16,17,18 తేదీల్లో జరుగుతాయని, మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని శేషమహల్ సెంటర్‌లో జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మహాసభలకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఎన్నిక చేయబడిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. 16వ తేదీన భారీ ర్యాలీ, 17, 18 తేదీల్లో డెలిగేట్స్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ, అమిత్ షా ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నాయని, ప్రజల ఓట్లతో గెలిచి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఉదయరాజు, ఇస్సారపు రమణ, భాష, ప్రసాద్, రాంబాబు, చంటి, సత్యనారాయణ, నాగేశ్వరరావు, బాలు, వెంకటపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి కుర్చీలు బహూకరణ



తణుకులో జిల్లా కేంద్ర ఆస్పత్రికి కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పట్టణానికి చెందిన చిట్టూరి అచ్యుతరామప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన సతీమణి చిట్టూరి సుజాత జిల్లా కేంద్ర ఆస్పత్రికి కుర్చీలు బహుకరించారు. ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కుర్చీలతోపాటు రోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డాక్టర్ రాఘవేంద్రరావు, ఫౌండేషన్ ఛైర్మన్ ప్రసన్నకుమార్ ఉందుర్తి, ఎలిషా, తలపాకుల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): శారీరక, మానసిక ఆరోగ్యం కోసం పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో అవగాహన కార్యక్రమం జరిగింది. నాగబుజ్జి మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మానవ శరీరానికి సరిపడినంత పోషక విలువలతో కూడిన ఆహారంతో పాటు శరీరానికి అవసరమైన మంచి నీరు అందించాలని, వ్యాయమం తప్పక చేయాలన్నారు. బీపీ, షుగర్‌లను అదుపులో ఉంచుకోవాలని, ఒత్తిడిని జయించాలని సూచించారు.

నజీముద్దీన్ మృతికి సంతాపం

అత్తిలి: గత 16 ఏళ్లుగా అత్తిలి మసీదు ప్రెసిడెంట్‌గా సేవలు అందించిన మహ్మద్ నజీముద్దీన్ మృతికి పలువురు ప్రముఖులు, మసీదు పెద్దలు సంతాపం తెలిపారు. నజీముద్దీన్ తణుకు ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. ఇంగ్లీషు అధ్యాపకునిగా ఈ ప్రాంతంలో ఎంతో మందికి శిక్షణ ఇవ్వడంతో ఉన్నత స్థితికి చేరుకున్నారు. మంచి వ్యక్తిగా, సౌమ్యుడిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. నజీముద్దీన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతికి అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఉప సర్పంచ్ శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



తణుకులో జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాలను చూపిస్తున్న మంత్రి కారుమూరి



ముద్దాపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



పాలి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గూడెంలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో తేన్నేటి జగ్జీవన్, వలంటీర్లు, గృహ సారథులు



రామచంద్రపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రచారం చేస్తున్న చల్లా లింగమూర్తి, తదితరులు

తణుకు అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు.తణుకు ఉండ్రాజవరం రోడ్డులో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రజానీకం స్వాగతిస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంట్లో వారు అందుకున్న సంక్షేమ ఫలాలను వివరిస్తున్నారని, గతంలో చంద్రబాబు కంటే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఎన్నో మంచి పథకాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వానికి అండగా నిలబడతామని చెబుతుండడం మంచి పరిణామమన్నారు. కరపత్రాల్లో ఉన్న ప్రశ్నలకు హుషారుగా సమాధానాలు చెప్పడమే కాకుండా వారి మొబైల్‌కు, ఇంటి గుమ్మానికి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్‌లను వేయించుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా టోల్ ఫ్రీ నంబరుకు ప్రజానీకం తమ మొబైల్ నుంచి డయల్ చేయగానే జగనన్న ఆడియోకాల్ రావడాన్ని కూడా ప్రజలు ఆనందిస్తున్నారని చెప్పారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, జేఎస్ఎస్ తణుకు పట్టణ కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, బోడపాటి వీర్రాజు, షేక్ బాజీ, ఎం.లలిత, రేలంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

తణుకు టౌన్: సంక్షేమ పథకాలు అమలు తీరును తెలుసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని తణుకు మండలంలోని గ్రామాల్లో శుక్రవారం పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ప్రారంభించారు. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు , గృహ సారధులు, వలంటీర్లు కలసి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కోనాల, ముద్దాపురం గ్రామాలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల జేసీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్, ముద్దాపురం గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, కోనాల సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దండు వెంకట కృష్ణంరాజు, శిరిగిశెట్టి గోపాలకృష్ణ, ఎంపీపీ రుద్ర ధనరాజులతో పాటు గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీ సభ్యులు పీ అశోక్, శ్రీనివాస్‌లతో తదితరులు పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీలు రెడ్డి హైమా, చుంద్రు శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

పాలిలో జగనన్నే మా భవిష్యత్

అత్తిలి: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేనంత అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అత్తిలి మండలం పాలి గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. ప్రతి గడపకు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వలంటీర్ సేవలు తదితర అంశాలపై లబ్ధిదారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మండల పార్టీ నాయకులు గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు, కంకటాల సతీష్, కోరుకొల్లు వెంకట్రావు, కాసగాని అబ్బులు, గంటానాగరాజు, నల్లమిల్లి బాలాజీరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కేతా రఘురాం, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కొవ్వూరి హనుమంతరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, మేడపాటి అప్పిరెడ్డి, కంకటాల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి జగనన్నే మా నమ్మకం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు స్థానిక 13వ వార్డులో వార్డు ఇన్‌ఛార్జి తెన్నేటి జగ్జీవన్ ఆధ్వర్యంలో శుక్రవారం గృహ సారథులు, వార్డు వలంటీర్లు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తేన్నేటి జగ్జీవన్ మాట్లాడుతూ జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో ప్రజల నుంచి ప్రభుత్వానికి మద్దతు లభించిందన్నారు. ధర్నాల శేఖర్, ఎర్రంశెట్టి కృష్ణవేణి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

పెంటపాడు: జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్ ముడిపడి ఉందని, రాబోయే రోజులలో జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదరించాలని రామచంద్రపురం చేనేత వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు చల్లా లింగమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచనలతో శుక్రవారం గ్రామంలో జగనన్నే మాభవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల బ్రోచర్‌లను గ్రామంలో ఆవిష్కరించి గ్రామంలో ప్రచారం చేశారు. మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన...జగన్ పాలన

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- దండగర్రలో గడప గడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం దండగర్ర గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: జనం మెచ్చిన పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదని, అడుగడుగునా సంతృప్తి వ్యక్తమౌతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం దండగర్ర గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ 2014లో చంద్రబాబుకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కాలదన్నుకున్నారన్నారు. అప్పట్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. చివరకు చంద్రబాబు సామాజికవర్గానికే ద్రోహం చేశారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలను చంద్రబాబు దోచేశాడని ఆరోపించారు. ఆ పాపం ఏనాటికి పోతుందో తెలియదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇదిలా ఉంటే పవన్‌కు చంద్రబాబు గురించి తెలియడం లేదన్నారు. ప్రజలు, కార్యకర్తలపై పవన్‌కు విశ్వాసం లేదని, చంద్రబాబు నిన్ను... నువ్వు చంద్రబాబును నమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంగా ఎదగాలంటే పార్టీని నిలబెట్టుకోవాలన్నారు. చంద్రబాబును పక్కన పెట్టిన ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగిన నాడే రాజకీయ భవిష్యత్ ఉంటుందన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల ఢిల్లీ పర్యటనలో బీజేపీ అధిష్టానం స్పష్టం చేసిందనే విషయాన్ని గుర్తు చేశారు. తొలుత గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ప్రారంభించి, యంత్ర సేవా పథకంలో రూ.14లక్షలు విలువైన ఏడు ట్రాక్టర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్ పిల్లా రాంబాబు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు వీరమళ్ల వెంకన్న, మార్లపూడి సుబ్బారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, నాయకులు ముద్రగడ లలితకుమారి,ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, చిట్టూరి భాస్కరరావు, యాతం సత్యనారాయణ, సత్తినీడి కొండలరావు, ములగాల గంగారావు, గట్టి సత్యనారాయణ, ములగాల శ్రీనివాస్, తహసీల్దార్‌వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష, ఏపీవో కేవీవీఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, పీఆర్ ఏఈ జి.పవన్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశాలాక్షి, పంచాయతీ కార్యదర్శి అంకం శ్రీరామకృష్ణ, ఏఎస్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమ పథకాలు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి

- ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం
- 7వార్డులో గడపగడపకు మన ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకే దక్కిందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు.తణుకు ఏడో వార్డులో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడప గడపలోను మళ్లీ మా జగనే రావాలంటూ ప్రజానీకం హారతులు పడుతుండడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీరు వ్యవస్థ ద్వారా అడగకుండానే అన్ని పథకాలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. అర్హులైతే చాలు కులం, మతం పార్టీ బేధాల్లేకుండా అమలు చేస్తున్న ప్రభుత్వం అంటూ స్వాగతాలు పలుకుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఏ పథకమైనా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్న తీరు లబ్ధిదారులు స్వాగతిస్తున్నారని అన్నారు. ఏపీలో అమలవుతున్న పథకాలతో దేశ వ్యాప్తంగా ముఖ్యమంత్రులంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజానీకం తెలిపిన పలు సమస్యలను పరిష్కరించాల్సిందిగా మంత్రి కారుమూరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డీజే అమూల్యారావు, కర్రి కాశీరెడ్డి, సుద్దుల పాండు, డోలా సింహాద్రి, కుడిపూడి చంద్రరావు, సామంతుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి మార్గాన్ని అనుసరించాలి



గూడెం పట్టణంలో ఆర్సీఎం ఆధ్వర్యంలో శిలువ యాత్ర చేస్తున్న విశ్వాసులు, చర్చిల నిర్వాహకులు

పెంటపాడు: గుడ్ ఫ్రైడే వేడుకలు పట్టణంలోని పలు చర్చిల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 40 రోజుల నుంచి క్రైస్తవులు చేస్తున్న ఉపవాస ప్రార్ధనలను శుక్రవారంతో ముగించారు. ఆయా ప్రార్ధనా కేంద్రాలలో ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల సారాన్ని బోధకులు విశ్వాసులకు వివరించారు. గూడెం టౌన్ లూథరన్ ఎ. క్లాష్ ఫ్యారిష్ చర్చిలో సంఘ గురుమండల అధ్యక్షుడు కె. విజయరాజు ఆధ్వర్యంలో బోధకులు 7 మాటల సారాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయగురుమండల అధ్యక్షుడు చర్చి పాలకవర్గం, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు, మహిళా సంఘ సభ్యులు, యూత్ సంఘ సభ్యులు అధికసంఖ్యలో ప్రార్ధనలకు హాజరయ్యారు.

ముదునూరుపాడులో సంఘ అధ్యక్షుడు ఎ. దైవారావు ఏడు మాటల సారాన్ని వివరించారు. అనంతరం దూరప్రాంతం నుండి హాజరైన విశ్వాసులకు ఉపవాస దీక్షల ముగింపు పురస్కరించుకొని చర్చిలో భోజన సదుపాయాలు సమకూర్చారు. పెంటపాడు లూథరన్ చర్చిలో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గూడెం సీతారాం పేట, వీకర్స్ కాలనీలో ఉన్న బైబిలుమిషను దేవేష్టమ్, హానోక్ ప్రార్ధనామందిరాలలో దైవసేవకులు రాజా ఎలీషా, మరనాత ఎలీషా, ఆనంద్ బెసలేల్‌లు ప్రత్యేక ప్రార్ధనలు చేసి శిలువపై పలికిన ఏడుమాటలను వివరించారు. ప్రపంచ శాంతికి క్రీస్తు శిలువలో పలికిని ఏడుమాటల సారాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కుంచనపల్లి ఇమ్మానియేలు స్వస్థత శాలలో పాస్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రార్ధనలు జరిగాయి. పెంటపాడు కునాకర పేట ఆర్‌ఈఐ చర్చిలో పాస్టర్ కె. యోహెజ్కేలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి కాముకులుగా జీవించేందుకు క్రీస్తుమార్గాన్ని అనుసరించాలన్నారు. చినతాడేపల్లి షెకీనా బైబిలుమిషను మందిరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. జెట్లపాలెం రూపాంతర దేవాలయం, మీనవల్లూరు, రామచంద్రపురం, కోరిమిల్లి, చింతపల్లి బి. కొండేపాడు, కె. పెంటపాడు, విప్పర్రు, ఆకుతీగపాడు, రావికుంట తదితర గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. గూడెం బస్టాండ్ సెంటర్ నుంచి కడకట్ల, మీదుగా గూడెం మథర్‌వన్నిని చర్చికి ఆర్సీఎం చర్చి నిర్వాహకులు శిలువయాత్ర నిర్వహించారు.

తణుకు టౌన్: గుడ్ ఫ్రైడే సందర్భంగా తణుకు మండలంలోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. తణుకు ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో విశ్వాసులు పట్టణంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. తణుకు మండలంలోని వేల్పూరులోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి, దువ్వ గ్రామంలోని తదితర గ్రామాల్లో చర్చిలలో గుడ్ ఫ్రైడే ప్రార్ధనలు నిర్వహించారు.

అత్తిలిలో : గుడ్ ఫ్రైడే వేడుకలు అత్తిలి మండలంలోని క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్దలతో శుక్రవారం జరుపుకున్నారు. ఉదయం నుంచి చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. అత్తిలి గ్రామంలో గల మరనాత గార్డెన్స్‌లో గుడ్ ఫ్రైడే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మరనాత గార్డెన్ అధ్యక్షుడు జాన్సన్‌జాషువా మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఇరగవరంలో : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఇరగవరం, గోటేరు, కంతేరు, పేకేరు, ఏలేటిపాడు, రాపాకా, సూరంపూడి, అర్జునుడుపాలెం, కావలిపురం, రేలంగి గ్రామాల్లోని చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. రేలంగి శివారు బొబ్బరాజు పాలెంలో పాస్టర్ రెవ గునుపూడి మార్టిన్ లూథర్ అధ్వర్యంలో యేసు క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలు వివరించండం జరిగింది. ఆ బోధలు విని ఆచరిస్తే ప్రపంచంలో శాంతి నెలకొంటుందన్నారు. ఈ ప్రార్ధనల్లో ఆయా గ్రామాల్లోని సంఘ పెద్దలు, డెలిగేట్స్, స్త్రీల సమాజం సంఘ కాపరులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

పెంటపాడు: ప్రభుత్వం రైతుల వద్ద నుంచి షరతులు లేకుండా తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణ రావు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో రావికుంట, ఆకుతీగ పాడు గ్రామాలు సందర్శించి రైతుల వద్ద ధాన్యం రాసులను పరిశీలించారు.

బలుసులమ్మ అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకరణలో బలుసులమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు వైభవంగా జరిగాయి. విశేష హారతులు అనంతరం అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ కొట్టు రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ నవహారతులు నిమిత్తం దాతలు వెండి సమర్పించినట్లు వెల్లడించారు. నాగ హారతి, సింహ హారతి, నక్షత్ర హారతి, వెండి వాకలి నిమిత్తం పద్మజ ఫ్యాన్సీ, ఎస్.ఎస్.రాజు, కట్టా నరసింహారావులు, వాసవి జ్యూయలర్స్, అడ్డగర్ల శ్రీహరిబాబులు సుమారు 4.5 కేజీల వెండి సమర్పించినట్లు తెలిపారు. ఉపముఖ్యమంత్రి, మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తుల సహాయ సహకారాలతో బలుసులమ్మ అమ్మవారి ఆలయాన్ని క్షేత్రదర్శినీగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద ప్రోలు భాస్కర్, ఎ.రమేష్ కుమార్, జి.రామస్వామి, నున్న హైమ రంగానాయకులు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు సేవా భావంతో పనిచేయాలి

అత్తిలి: గృహసారథులు తమ కర్తవ్య విధులను సక్రమంగా నిర్వహించి, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేవిధంగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అత్తిలి గ్రామసచివాలయం కార్యాలయంలో శుక్రవారం గృహసారథులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఏమైనా సమస్యలు ఉంటే గృహసారథు కన్వీనర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరును తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మండలపార్టీ నాయకులు గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, గంటా నాగరాజు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.